క్లుప్తంగా

తెట్టంగిలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ దీపిక

గుర్ల: మండలంలోని తెట్టంగి గ్రామంలో విజయనగరానికి చెందిన శ్రీ సాయి సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 160 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని డాక్టర్ దీపిక తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ జమ్ము పార్వతి, నాయకులు జమ్ము లచ్చన్న తదితరులు శిబిరాన్ని సందర్శించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా విరివిగా మొక్కలు నాటుతున్నామని స్థానిక గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) వ్యవస్థాపకులు బి.రామృష్ణ చెప్పారు. పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన విద్యార్థి బొబ్బిలి హృషీకేశ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని బెహరా చెరువు వద్ద ఆదివారం మొక్కలు నాటారు. అలాగే స్థానికులకు వంద పారిజాతం మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున పది మొక్కలు నాటడం అలవా టు చేసుకోవాలని రామకృష్ణ సూచించారు.కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ విజయలక్ష్మి, జియో సభ్యులు వి.సుశీల, ఎల్.సత్యం, పి.శ్రీనివాసరావు, టి.వంశీ, ఎస్.హర్ష తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్



చామలాపల్లిలో జేసీబీతో తుప్పల తొలగిస్తున్న దృశ్యం

వేపాడ: మండంలోని జాకేరు -దబ్బిరాజుపేట రహదారిలో చామలాపల్లి గ్రామ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పల తొలగింపు పనులను సర్పంచ్ కోలా సతీష్ ఆదివా రం చేయించారు. జేసీబీతో తుప్పలు, డొంకలను తొలగించారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జయంతి

దత్తిరాజేరు: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల జోలికి పోవద్దని పెదమానాపురం ఎస్ఐ జయంతి సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పెదమానాపురం సంత వద్ద ఆటో డ్రైవర్లు, యువతకు ఆదివారం అవగాహన క ల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సరదా కోసం కొందరు, తెలిసీ తెలియక మరికొందరు డ్రగ్స్‌కు బానిసలు గా మారుతున్నారని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా మార్కెట్ షెడ్ల నిర్మాణం



గజపతినగరం బజార్ సెంటర్‌లో నిర్మిస్తున్న షెడ్లు

గజపతినగరం: స్థానిక రోజు వారీ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాల నిర్వహణకు సంబంధించి న షెడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్కెట్‌లో షెడ్లు లేకపోవడంతో చిరు వ్యాపారులు గుడారాలు, టార్పాలిన్‌లు, గొడుగులు వేసుకొని కూరగాయలు, ఇతర సరుకులు విక్రయించుకోవాల్సి వస్తోంది. ఎండలు, వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారు. తమతో పాటు వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా గ్రామపంచాయతీకి చెందిన సుమారు 20 సెంట్ల స్థలంలో షెడ్లు నిర్మించి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని చిరువ్యాపారులు పంచాయతీ పాలకవర్గాన్ని కోరారు. దీంతో నాబార్డ్ సాయంతో షెడ్ల నిర్మాణానికి పంచాయతీ పాలక వర్గం ఆమోదించింది. పంచాయతీ కేటాయించిన స్థలాన్ని గతప్రభుత్వ హయాంలోనే బ్రిడ్స్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో నాబార్డ్, బ్రిడ్స్ అధికారులు పరిశీలించారు. 20 సెంట్ల స్థలంలో 40 షెడ్ల నిర్మాణానికి నాబార్డ్ రూ.15 లక్షలు మంజూరు చేయగా, రూ.5 లక్షలు పంచాయతీ నిధులు మంజూరు. షెడ్ల నిర్మాణానికి ఎన్నికలకు ముందు ఎంపీపీ, జెడ్పీటీసీ, పంచాయతీ అధికారులు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి.

సాగు సాయమేదీ..?

- నేటికీ అందని ఖరీఫ్ పెట్టుబడి సాయం
- ఎరువులు, పురుగు మందుల కోసం అప్పులు చేస్తున్న రైతులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరిట రైతులకు ఠంచన్‌గా అందిన సాయం
- గత ప్రభుత్వంలో గజపతినగరం నియోజకవర్గ రైతులకు అందిన సాయం రూ.312.67 కోట్లు



పెదవేమలిలో వరి పంటకు ఎరువు వేస్తున్న రైతు

గంట్యాడ:

తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ. 20వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు, ఎన్డీఏ కూటమి నేతలు ఊరూరా ఊదర గొట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ సాయం ఇస్తామని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేశా రు. తీరా గెలిచిన తర్వాత రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారం చేపట్టి 100 రోజులు దాటినా రైతులకు పెట్టుబడి సాయం కింద రూపాయి కూడా అందించ లేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరిట రైతులకు సహాయం అందిస్తే...కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. పథకం పేరు మార్చడంలో సీఎం చంద్రబాబునాయుడు చూపించిన శ్రద్ధ అమలు చేయడంలో చూపకపోవడంతో అన్నదాత లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి నేతల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు.

పెట్టుబడి కోసం అప్పులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోతున్నా నేటికీ కూటమి ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందించ లేదు. నియోజకవర్గంలో రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, గోగు తదితర పంటలు సాగు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో రైతులు విత్తనాల కొనుగోలు, వరి నారుపోసేందుకు, దమ్ముల కు, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కులు, ఎరువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ పంటలు వివిధ దశల్లో ఉన్నా యి. వరి పంటకు రెండో దఫా ఎరువులు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంట వేసేందుకు అప్పులు చేసిన రైతులు మళ్లీ ఇప్పుడు ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లకు అప్పులు చేయాల్సి వస్తోంది. రైతులు ఇప్పటికే ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇంకా పెట్టుబడి పెట్టలేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద 2019 నుంచి 2023 వరకు అందిన సాయం

మండలం	అందిన సాయం
గంట్యాడ	రూ.80.56 కోట్లు
గజపతినగరం	రూ.63.87 కోట్లు
దత్తిరాజేరు	రూ.60.75 కోట్లు
బొండపల్లి	రూ. 53.63 కోట్లు
మెంటాడ	రూ. 53.85 కోట్లు

రూ.15 వేలు అప్పు చేశాను.



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట సాగు చేస్తున్నాను. పంట పెట్టుబడికి ఓ వ్యక్తి దగ్గర రూ. 15 వేలు అప్పు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఏటా పంట వేసే ముందు రైతు భరోసా డబ్బులు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం ఇంత వరకు రూపాయి కూడా సాయం అందించలేదు.

– సిరపురపు సన్యాసయ్య రైతు, పెదవేమలి గ్రామం, గంట్యాడ మండలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటల సాగు ప్రారంభం కాకముందే రైతు భరోసా పథకం పేరుతో పెట్టుబడి సాయం అందించే వారు. ఏటా రూ. 13,500 చొప్పున రైతులకు సాయం అందించేంది. మే నెలలోనే మొదట విడత సాయాన్ని అందించే వారు. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేవారు. రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. గజపతినగరం నియోజకవర్గ రైతులకు 2019 నుంచి 2023 వరకు అప్పటి ప్రభుత్వం రూ.312 కోట్లు పెట్టుబడి సాయంగా అందజేసింది.

వైద్యఖర్చులకు రూ.లక్ష సహాయం



బాధతురాలి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న గౌరీ మాధవి

జామి: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని జి.లక్ష్మీ కుమరాం కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ విద్యార్థిని తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పించారు. పేదకుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందిపడుతున్నా రు. దీంతో బాధిత విద్యార్థిని చదువుకుంటున్న కేజీబీవీలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న గౌరీమాధవి స్పందించారు. విద్యార్థినికి వైద్యఖర్చుల కోసం ఆమెతో పాటు భర్త వెంకట శ్రీను, మరిది రవితేజ, ఆమె చెల్లితో పాటు మిత్రులు కలిసి లక్ష రూపాయలు సమకూర్చారు. గౌరీ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి తల్లిదండ్రులుకు నగదు అందజేశారు.



గజపతినగరం: బాధిత చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న సహాయ ఫౌండేషన్ సభ్యులు

చిన్నారి వైద్యానికి సహాయం

గజపతినగరం: మూడు నెలల చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, నేత్రాలయ ఐకేర్ సంయుక్తంగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందించాయి. విశాఖపట్నానికి చెందిన మూడు నెలల చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు తమకు సమాచారం రావడంతో తమ వంతు సహాయం చేశామని సహాయ స్ఫూ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్,రేవంత్, నేత్రాలయ ఐకేర్ నిర్వాహకురాలు జి.మౌనిక తెలిపారు. ఆదివారం వారు విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందజేశారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ముల్లు తాతినాయుడు, ఆశిక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం



విద్యార్థి శివాజీ తల్లిదండ్రులను సన్మానించి సహాయం అందజేస్తున్న రాష్ట్ర ఎరుకుల సంఘం సభ్యులు

శృంగవరపుకోట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించి ఆర్థిక స్తోమత లేక అవస్థపడుతున్న విద్యార్థికి ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పోతనాపల్లికి చెందిన రొంగలి శివాజీ నీట్‌లో ర్యాంక్ సాధించి రాజీవ్‌గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. శివాజీ తలిదండ్రులు కేవలం వృత్తి పనివారు కావడంతో కుమారుడి చదువు ఖర్చులకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 22న సాక్షిలో 'పేదింట్లో విరిసిన విద్యా కుసుమం' శీర్షికన శివాజీ నేపథ్యంపై వచ్చిన వార్తకు రాష్ట్ర ఎరుకుల సేవా సంఘం సభ్యులు స్పందించారు. ఆదివారం వారంతా పోతనాపల్లి గ్రామానికి వెళ్లి శివాజీ తల్లిదండ్రులను సన్మానించారు. వారికి రూ.32,000 నగదు అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలపర్తి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గేదెల సత్తిబాబు, సంఘ మహిళా విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షురాలు దాసరి నారాయణమ్మ, మహిళా కార్యదర్శి దాసరి సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోనేటి చిన్నారావు, శ్రీరామ్, పోతనాపల్లి మాజీ సర్పంచ్ గేదెల పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగుపై ఆసక్తి



సింగవరంలో సాగులో ఉన్న బొప్పాయి పంట

మెరకముడిదాం: చీపురుపల్లి నియోజకవర్గంలో బొప్పాయి సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. బొప్పాయి సాగు సిరులు కురిపిస్తుండడంతో మెరకముడిదాం, చీపురుపల్లి, గుర్ల, గరివిడి మండలాల్లో అన్నదాతలు ఈ పంటను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చీపురుపల్లి మండలంలో 22 ఎకరాల్లో, గుర్ల మండలంలో27 ఎకరాల్లో, మెరకముడిదాం మండలంలో 8 ఎకరాల్లో, గరివిడి మండలంలో 5 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. బొప్పాయి మొక్కలు నాటిన అయిదో నెలనుంచి పంట దిగుబడి ప్రారంభమై 18 నెలలు వరకూ వస్తుందని, పంటసాగుకు ఎకరానికి రూ.1.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సుమారు 25 నుంచి 30 టన్నులు వరకూ దిగుబడి వస్తుందని, ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను బొప్పాయి ధర రూ.19,000 వరకూ పలుకుతోందని రైతులు, ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు.గత ప్రభుత్వంలో ఈపంట సాగు చేసిన అయిదు ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులకు సూక్ష్మసేద్యం పరికరాలను 90 శాతం రాయితీపై అందించారు. అలాగే సాగుచేసిన మొదటి సంవత్సరం హెక్టార్‌కు రూ.18,750, రెండో ఏడాది ఎకరానికి రూ.6వేలు చొప్పున ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం అందజేసింది.

దిగుబడి బాగుంది



బొప్పాయి పంట దిగుబడులు బాగుండడంతో పాటు ధర కూడా బాగా పలుకుతుండడంతో రైతులు ఈపంటపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఈపంట సాగు చేసే రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తోంది. 5నుంచి 18 నెలలు పాటు పంట ఫల సాయం పొందవచ్చు. రైతులకు ఇది మంచి లాభదాయకమైన పంట.

– సీహెచ్.చంద్రశేఖరరావు, ఉద్యానశాఖాధికారి, చీపురుపల్లి


సిరిమాను చెట్టుకు పూజలు



హుకుంపేటలో సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో సిరిమానుగా రూపుదిద్దుకోనున్న చెట్టుకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నాలుగైదు రోజుల్లో సిరిమాను ప్రక్రియ పూర్తిచేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి..

సిరులతల్లి పైడితల్లి ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ కష్టాలే..

- నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి
- ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయలేదు
- రూ.50వేల కోట్లు అప్పుచేసి.. ఏం చేశారో చెప్పాలి
- అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచేసిన కూటమి ప్రభుత్వం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ కష్టాలు తప్పడం లేదని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించా రు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయ కుండా వంద రోజుల్లోనే రూ.50వేల కోట్లు అప్పుచేసి కూటమి ప్రభుత్వం కొత్త చరిత్ర సృష్టించిందని ఎద్దే వా చేశారు. కూటమి పాలనలో ప్రజల జీవన విధానం పూర్తిగా దెబ్బతిందని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటుతున్నాయన్నారు. 15 కిలోల వంట నూనె ధర రూ.1,600 నుంచి రూ.2 వేలు దాటి పోయిందని, పప్పుదినుసులు, ఉల్లి, కూరగాయల ధరలు భారీగా పెరిగిపోవడంతో సామాన్యు లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా రూ. 50వేల కోట్లు అప్పు చేసి ఏం చేశారో ప్రభుత్వ పెద్దలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులు పాలుచేసేశారని టీడీపీ వారు పదేపదే ప్రచారం చేసేవారని, ఆయన అప్పులు చేసినా ఆ డబ్బులు ప్రజల కోసం ఖర్చు చేశారని, ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. మరి మీరు చేసిన అప్పుతో ఏం చేశారో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని కూటమి ప్రభుత్వ పెద్దలను ఉద్దేశించి అన్నారు. తనకు ఎంతో అనుభవం ఉందని, సంపద సృష్టిస్తానని చెప్పిన పెద్ద మనిషి నారా చంద్రబాబునాయుడు సృష్టించిన సంపద ఎక్కడని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించ లేక పోతున్నారని మండిపడ్డారు.

డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు...

ఇచ్చిన హామీలను అమలు చేయలేక, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అప్పలనరసయ్య మండి పడ్డారు.విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం కానివ్వకుండా కాపాడతామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు చెప్పారని, నేడు గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులకు అమ్మకం తప్పడం లేదని కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మ మాట్లాడారని, దీనిపై ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రకంగా మాట్లాడి డైవర్షన్ పాలిటిక్స్‌కు చంద్రబాబు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. పేద పిల్లలను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువ చ్చారని, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం అమలులోకి తీసుకువచ్చారని, పిల్లలకు బ్యాగు లు, నోట్ పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, బూట్లు, ట్యాబ్‌లు, నాణ్యమైన భోజనం అందించారని చెప్పారు. అటువంటి విద్యావ్యవస్థను చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశారని మండి పడ్డారు. వసతి గృహాలతో పాటు పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని, ఎంతో మంది ఆస్పత్రుల పాలవుతున్నారని, ఇది కూటమి దౌర్భాగ్య పాలనకు నిదర్శనమన్నారు. ఒక్క మెడికల్ కాలేజ్ కూడా ఏర్పాటు చేద్దామనే ఆలోచన రాని వ్యక్తి చంద్ర బాబు అని అన్నారు. పేద పిల్లలు డాక్టర్లు అవ్వాలనే సదుద్దేశ్యంతో జగన్ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే వాటిని ప్రైవేటు పరం చేసేం దుకు నీచమైన ఆలోచన చేసిన చంద్రబాబుకు ప్రజలు, విద్యార్థులు త్వరలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం

లోకేష్ చెప్పినట్లుగానే రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని అప్పలనరసయ్య అన్నారు. టీడీపీ నాయకులు కక్షకట్టి అధికారులపై ఒత్తిడి చేసి గ్రామాల్లో చిరుద్యోగులను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇసుక ఉచితమని చెప్పి ట్రాక్టర్ ఇసుకకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగులు బదిలీ కావాలంటే స్థానిక మంత్రికి ముడుపులు చెల్లిస్తే కానీ ఫైళ్లు కదలని పరిస్థితి అని అన్నారు. నీరు–చెట్టు కింద చెయ్యని పనులకు కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉపాధి హామీ నిధులను మళ్లిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాథరావు,రేగ సురేష్, పి.నారాయణమూర్తి,కడుపుట్ల పైడిపునాయుడు, కె.రామునాయుడు, గేదెల సురేష్ పాల్గొన్నారు.

నేడు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమసమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు.

డ్రిప్ పరికరాలకు ఆన్‌లైన్ చేసుకోండి

వేపాడ: రాయితీపై బిందు(డ్రిప్), తుంపర(స్ప్రింకర్లు) సేద్యం పరికరాలు కావాల్సిన రైతులు తమ వివరాలను తమ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేయించుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 2,560 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్ యూనిట్ల ఏర్పాటు కోసం వ్యవసాయ మోటార్లు ఉన్న 2,150 మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరికరాలు కావా ల్సిన రైతులు తమ వన్‌బీ, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే సిబ్బంది ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు. ఈ పరికరాల వల్ల తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, పంటకు ఎరువులు కూడా పంపించవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. వ్యవసాయ మోటారు సదుపాయం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వేపాడ: మండలంలోని కొత్త బొద్దాం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఎస్.కోట నుంచి కొత్తవలస వైపు స్కూటీపై వెళుతున్న ఇందుకూరు లక్ష్మీపతిరాజు(62) రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఆయన్ని తక్షణమే ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.